క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు


శ్రీ లక్ష్మి గణపతి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో బుధవారం సంకటహర చతుర్థశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్క్‌రోడు వద్ద ఉన్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో ఉదయాన్నే స్వామివారికి సుప్రభాత సేవ పంచామృత అభిషేకాలు నిర్వహించి, స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహాగణపతి హోమం నిర్వహించి పూర్ణాహుతి గావించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంబేడ్కర్ అవార్డు గ్రహీతకు సత్కారం


వీరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అంబేడ్కర్ అవార్డు గ్రహీత గురురాజ పాఠశాల ఉపాధ్యాయుడు, స్కూల్ కో ఆర్డినేటర్ వీరయ్యకు బుధవారం పీఈటీల సంఘం ఆధ్వర్యంలో పుల్లయ్య ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, నైతిక విలువలు నేర్పుతున్న వీరయ్యకు అంబేడ్కర్ ప్రతిభా అవార్డు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

సోనియా, రాహుల్‌పై చార్జ్‌షీట్లు దాఖలు దుర్మార్గం


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై చార్జ్‌షీట్ దాఖలు చేయడం దుర్మార్గమని ఆ పార్టీ నాయకులు అన్నారు. బీజేపీ సర్కారు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్రం తీరును నిరసిస్తూ బుధవారం ఆ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు మాట్లాడుతూ మోదీ సర్కారు తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కవ్వింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతలయ్య, ప్రసాద్, చాబోలు సలాం, అభిరాం, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ కాల్వకు అరకొరగా నీరు విడుదల


తెలుగుగంగ ప్రధానకాల్వలో పారుతున్న నీరు

రుద్రవరం: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ కాల్వకు మూడు రోజుల క్రితం అధికారులు తక్కువ సామర్థ్యంలో సాగు నీరు విడుదల చేశారు. అయితే, బుధవారం నాటికి ఆ నీరు రుద్రవరం మండలంలోని అప్పన పల్లె సమీపంలో ఉన్న 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ వరకే చేరాయి. అక్కడి నుంచి దిగువకు పారడం లేదు. ప్రస్తుతం వరి, మినుము, మొక్క జొన్న వంటి పంటలన్నీ కోతలు సాగుతున్నాయి. మరి కొన్ని గ్రామాల పరిధిలో సాగు చేసిన పంటలకు నీరు అందక ఎండి పోయాయి. పది రోజుల ముందు నీరు విడుదల చేసి ఉంటే పంటలు ఎండకుండా కాపాడుకునే వారమని అంతా అయ్యాక ఇప్పుడు 500 కూసెక్కుల నీరు విడుదల చేస్తే ఏ మూలకు సరిపోతాయని మండలంలోని రైతులు ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన గాత్ర కచేరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై యు.వి.ఎస్.కిరణ్, బృందం వారి గీత్రకచేరి ఆకట్టుకుంది. సిద్ధివినాయకం, శంభోశంకరా, భో శంభో, నాదతాండవం శంకరం, దేవ దేవం భజే, కాలభైరవాష్టకం, నమోస్తు వాణి, బ్రహ్మమురారి, నమశ్శివాయ నటేశ్వరాయ తదితర గీతాలను, అష్టకాలను యు.వి.ఎస్.ఎస్.కిరణ్ ఆలపించారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.71వేల విరాళం

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి బుధవారం నందవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి కోటేశ్వరరెడ్డి కుమార్తె శివమ్మ కుటుంబ సభ్యులు రూ.71 వేల విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు నగదు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాల్చితే అనర్థం..
దున్నేస్తే భూసారం!

- వరిగడ్డిని కాల్చడం ద్వారా భూమిలో తేమ శాతం తగ్గుతుంది
- పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది
- మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోతాయి
- కలియదున్నితే అనేక లాభాలు


గోస్పాడు శివారులో పొలంలో వరిగడ్డిని కాల్చివేస్తున్న దృశ్యం

గోస్పాడు: కూలీల కొరత పెరిగిపోతుండడంతో రైతులు వ్యవసాయంలో యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా వరికోతలకు హార్వెస్టర్లను విరివిగా వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశువులు ఉన్న రైతులు వరిగడ్డిని నిల్వ చేసుకుంటుండగా, మిగతా రైతులు పొలంలోనే వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరికొయ్యలతో పాటు వరి గడ్డికి నిప్పు పెడుతున్నారు. రైతులు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వరిగడ్డి, కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదున్నితే మంచి ఫలితాలు పొందవచ్చునని సూచిస్తున్నారు. జిల్లాలో సాగునీటి వనరులు అధికం. తెలుగుగంగ, కేసీ, కుందూ నదుల కింద 90 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఏటా రెండుకార్లు పండిస్తారు. నంద్యాల, గోస్పాడు, మహానంది, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో రబీ కింద సాగు చేసిన వరి పంట చేతికి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం ఇంటికి చేరడంతో రైతులు తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

కాల్చితే కలిగే నష్టాలు ఇవే..

రైతులు పొలంలో గడ్డిని మండించడం ద్వారా కలిగే వేడి భూమిలో సుమారు సెంటి మీటరు లోతు వరకు వెళుతుంది. దీంతో క్రమేపి భూములు నిర్జీవంగా మారే అవకాశం ఉంది. అంతేగాకుండా వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటలను ఆశించే చీడపీడల ఉధృతి పెరుగుతోంది. టన్ను గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.8 కిలోల పాస్పరస్, 2.5 కిలోల పొటాషియం, 1.0 కిలోల సల్ఫర్‌తో పాటు నేలలో ఉండే సేంద్రియ కర్బనాన్ని కూడా కోల్పోతుంది. గడ్డి తగలబెట్టడం వల్ల వచ్చే పొగ పీల్చడం వల్ల ఆస్తమా తదితర శ్వాస సంబంధ రుగ్మతలు ఏర్పడే అవకాశం ఉంది. అలాగే పొలాల్లో తిరిగే పాములు, ముంగిసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు మంటల్లో చనిపోయి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.

కలియ దున్నితే ప్రయోజనం

వరి కొయ్యలు నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే దాదాపుగా ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది. టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని. 1.1 కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరమవుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి.

పంట వ్యర్థాల సమర్థ వినియోగానికి ప్రత్యామ్నాయాలు..

పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్ట్ చేయడం వల్ల ఎంతో విలువైన సేంద్రియ ఎరువు తయారవుతుంది. వరి గడ్డి పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుంది. అంతేగాక కొన్ని ప్రైవేటు సంస్థలు ఈ గడ్డిని ఉపయోగించి ప్యాకింగ్ మెటీరియల్, ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్నందున గ్రాసాన్ని విక్రయించుకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చు.

రైతుల్లో అవగాహన పెరగాలి



పొలాల్లో వరిగడ్డిని తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలున్నాయి. వేడి వల్ల భూమికే గాకుండా మనుషులకు తీవ్ర నష్టాలున్నాయి. గడ్డిని సమర్థంగా వినియోగించుకోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమేగాక రైతులు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వరి గడ్డిని చేనులలో దుక్కిదున్నడం వల్ల పైరుకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
–స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారిణి, గోస్పాడు

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర పేరుతో తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బుధవారం అధికారులకు ఒక ప్రకటనలో ఆదేశించారు. సేవల కోసం అధికారిక వాట్సాప్ నంబర్ 9552300009 ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 254కి పైగా సేవలు అందిస్తుందన్నారు. జూన్ నెలకు 500కు పైగా సేవలందించాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకునేలా సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ హరిక్రిష్ణ ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 గ్రామ పంచాయతీల పరిధిలో 13,200 పనిదినాల్లో వ్యవసాయ కూలీలు వ పాల్గొనవలసి ఉండగా ఈ వారం 5,058 పనిదినాల్లో మాత్రమే పాల్గొన్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఏ కోఆర్డినేటర్ రామకృష్ణ

ఉయ్యాలవాడ: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఎన్ఎఫ్ఏ నోడల్ కోఆర్డినేటర్ రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాలలో నవధాన్యాలను సాగు చేసుకోవడం వల్ల నేల సారవంతమవుతుందని సాగు పూర్తైన తరువాత మరలా వాటిని సాగు చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా తక్కువ వర్షపాతం ఉన్న సమయంలో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. రైతులకు జీవామృతం, ఘణామృతం తయారీ విధానంపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం పంటల సాగుకు భారీగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారని, దీంతో పెట్టుబడులు అధిక మవుతున్నాయన్నారు. ఇటువంటి సమయంలో ప్రకృతి విపత్తులు సంభవిస్తే రైతు కోలుకోలేడన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దాస్, ఏఈఓలు రాణి, సునీత, వీఏఏలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


డీఐఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల జిల్లా ఇంటర్ వృత్తి విద్యాధికారి సునీతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు మండలాల విద్యార్థులకు సప్లిమెంటరీ ఫీజు మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శశిధర్, ప్రవీణ్, మల్లికార్జున, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయని కార్పొరేట్ విద్యా సంస్థలు నగరంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలని, అలాగే ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చెంచులకు సాగు భూమి ఇప్పించండి


డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ గ్రామ పంచాయతీ మజరా అయిన చిన్నయ్యస్వామి చెంచు గూడెం వాసులకు సాగు భూమి ఇప్పించాలని సీపీఎం జిల్లా నాయకులు రామచంద్రుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గూడెం వాసులతో కలిసి మండల కేంద్రమైన రుద్రవరంలోని రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకొని డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా గూడెం వాసుల్లో కొంత మంది పొలం లేక అడవికి వెళ్లి తేనె, గడ్డలు వంటివి తెచ్చుకొని వాటిని విక్రయించి వచ్చిన అరకొర డబ్బుతో జీవితం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, గూడెం నాయకులు హనమంతు, అల్యూరయ్య, సుబ్బరాయుడు, మహేష్ తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి అమ్మణ్ణరాజు బుధవారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. ఆయన కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని న్యాయమూర్తికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

అవీ-ఇవీ

శేషవాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేటలో వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు బుధవారం రాత్రి శేషవాహనంపై పట్టణ వీధుల్లో విహరించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఆశీనులను చేసి కర్పూర నీరాజనాలు పలికారు. మేళతాళాల నడుమ గొరిపేట, పాత తహసీల్దార్ కార్యాలయం, సుబ్బారెడ్డి నగర్, సుద్దబావి, కూరగాయల మార్కెట్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ సుజాత శర్మ, కమిటీ సభ్యులు హుసేన్‌రెడ్డి, మారుతి శర్మ, సుధాకర్ రెడ్డి, రమణ, శ్రీను పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

కొలిమిగుండ్ల: గనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. బుధవారం సీఐ రమేష్‌బాబుతో కలిసి తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన మ్యాగజైన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బ్లాస్టింగ్ సమయంలో తీసుకుంటున్న సేఫ్టీపై ఆరాతీశారు. బ్లాస్టింగ్‌కు ఉపయోగించే సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. గనుల్లో పని చేసే కార్మికులకు సేఫ్టీ పరికరాలపై ఆరా తీశారు. గనుల్లో బ్లాస్టింగ్ పనులను పరిశీలించారు. అనంతరం తిమ్మనాయినపేటలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకోవాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు

ప్యాపిలి: కుష్టు, క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి ఆదేశించారు. బుధవారం ప్యాపిలి పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారిణి వాణిశ్రీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. కుష్టు, క్షయ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. మందులు సక్రమంగా వాడుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న పలు కార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎంటీడీసీ పీటర్, పారా మెడికల్ ఆఫీసర్ హక్, ఫిజియోథెరపిస్టు శ్రీనివాసులు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి హుసేన్‌బాషా, ముక్కెర కృష్ణారెడ్డి, సుబ్బారాయుడు అన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నూతన కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించి, పాతకార్యవర్గానికి వీడ్కోలు పలికారు. నూతన అధ్యక్షుడు హుసేన్‌బాషా మాట్లాడుతూ కోర్టు ఆవరణలో బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. న్యాయవాదుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని హెల్త్ క్యాంపులు, ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను సీనియర్, జూనియర్ న్యాయవాదులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల నియమావళి సభ్యులు రామకృష్ణయ్య, వెంకటప్రసాద్, సుదంసుమాళిరెడ్డి, రఘుప్రకాష్, తిరుపాల్, న్యాయవాదులు దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, నరసింగరావు, మద్దిలేటిస్వామిరెడ్డి, చిన్న లింగమయ్య, సౌజన్య, మధు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలి


మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్ సమ్మద్

నంద్యాల(న్యూటౌన్): మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నీటి గుంతలో పడి మరణించిన బాలుడి కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు మౌలానా అబ్దుల్ సమ్మద్, బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయం, బయటి ప్రదేశాల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహితం వల్ల ప్రజలు చనిపోతుంటే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీ గుంతలో పడిన అయాన్ కుటుంబానికి ఎక్స్‌గ్రేసియాతో పాటు కార్యాలయంలో మృతి చెందిన జవాన్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లుపై సదస్సు నిర్వహించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో అయూబ్, ఇబ్రహీం, వశీం, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై వీఆర్‌ఓలకు శిక్షణ


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(అర్బన్): పర్యావరణ విపత్తుల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీఆర్‌ఓలకు బుధవారం స్థానిక నిశాంత్ భవన్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్లు ప్రియదర్శిని, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు ముందస్తు సమాచారం ఉంటే ఏ విధంగా సహాయ సహకారాలు అందించాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మాట్లాడుతూ విపత్తులు జరిగినప్పుడు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్లు రామసంజీవరావు, రామచంద్రారావు, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తురాలికి పర్సు అప్పగింత


పర్సు అందిస్తున్న దృశ్యం

మహానంది: బెంగళూరుకు చెందిన ఆదిలక్ష్మి బుధవారం మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం ఉత్తరద్వార గోపురం నుంచి వెళ్లే క్రమంలో రాహుకేతు మండపం వద్ద తన పర్సును మరిచిపోయి వెళ్లారు. రామాలయం ముఖ్య అర్చకుడు వనిపెంట ప్రకాశం శర్మ పర్సును గుర్తించి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యకు అందించి మైకుల్లో అనౌన్స్ చేయించి బాధితురాలిని రప్పించి పర్సు, అందులో ఉన్న రూ.10,700 నగదును అందించారు. ముఖ్యఅర్చకుడికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న బీసీ ఫెడరేషన్ చైర్మన్

మహానంది: ఏపీ బీసీ ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి బుధవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుకుగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఆలయన ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలకగా స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, పాలకమండలిలో బీసీలకు చోటు కల్పించాలని, బీసీల జనగణన కార్యక్రమం చేపట్టాలని, బీసీల అభివృద్ధికి రూ.500 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేదపండితులు చైర్మన్ చక్రవర్తికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

దేవస్థాన వైద్యశాల అభివృద్ధికి
ప్రణాళికలు సిద్ధం చేయండి

- కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు


వైద్యులు, సిబ్బందితో సమావేశమైన దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: దేవస్థాన వైద్యశాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం దేవస్థాన వైద్యశాలను పరిశీలించి, వైద్య విభాగం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోజువారీగా వచ్చే ఓ.పి, దేవస్థానం చేపడుతున్న వైద్యపరీక్షలు, అందుబాటులో ఉన్న వైద్యపరికరాలు, రోజువారీగా వైద్యశాలలో అందజేస్తున్న ఔషధాలు, దేవస్థానం వైద్యశాలలో అందిస్తున్న ఔషధాలు, అత్యవసర వైద్యసేవలు మొదలైన వాటిని సమీక్షించారు. రోజుకు సగటున 250 మంది వైద్యసేవలు పొందుతున్నారని, రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యశాలలో ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని ఈఓ సూచించారు. గుండెజబ్బు, పాము, తేలుకాటు తదితర వ్యాధులకు మందులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన ఆయా ఔషధాల జాబితాను సంబంధిత అధికారులకు అందజేయాలని వైద్యులకు సూచించారు. ఏ సమయంలోనైనా అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్యాన్ని అందించేందుకు సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉండాలన్నారు. మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పంపేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాలలో తగినన్ని ఆక్సిజన్ సిలిండర్లు ఉంచుకోవాలన్నారు. రక్తపరీక్షలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరానికి అవసరమైన మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైద్యశాలలో పారిశుద్ధ్యం, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్యశాల నిర్వహణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ఏపీ, ఔషధాల స్టాక్ నమోదు, స్టాక్ వినియోగం, వైద్యశాల రికార్డుల నిర్వహణ మొదలైనవన్నీ అందులో నమోదు చేయాలన్నారు. పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, అపోలో వైద్యులు పవన్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పర్యవేక్షణ తప్పనిసరి


మాట్లాడుతున్న జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీ లీలావతి

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు ప్రతి రోజు తనిఖీ చేయాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లీలావతి అన్నారు. బుధవారం బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. బాలసంజీవని యాప్, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో వివరాలను పక్కాగా నమోదు చేయాలని, కొన్ని అంగన్‌వాడీ సెంటర్లు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. అలాంటి సెంటర్లలో యాప్‌పై అవగాహన కల్పించి బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టును జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంచేందుకు సూపర్‌వైజర్లు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు సాలమ్మ, శైలజ, చిట్టెమ్మ, జమిలా, సుగుణ, శాంతమ్మ, శివమ్మ పాల్గొన్నారు. అలాగే స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులుపై పలువురు బుక్‌కీపర్ల ఆరోపణలు, ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు రహస్య విచారణ చేశారు.